సాక్షి
విశాఖపట్నం
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025

తీరంలో ఆధ్యాత్మిక శోభ





- సాగర తీరంలో మాఘ పౌర్ణమి సందడి
- సముద్రస్నానాలు చేసిన నగరవాసులు

సాగర తీరంలో మాఘ పౌర్ణమి సందడి నెలకొంది. బుధవారం తెల్లవారుజాము నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తీరానికి పోటెత్తారు. వైఎంసీఏ ఎదురుగా, పాండురంగాపురం డౌన్, ఆర్కే బీచ్, సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి తదితర తీర ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు సముద్రం ఒడ్డున ఇసుకతో శివలింగాన్ని తయారు చేసి పూజలు చేశారు. దీపాలు వెలిగించి సూర్య భగవానుడికి స్వయంగా హారతులిచ్చారు. సూర్యభగవానుడికి అర్ఘ్యం అర్పించారు. పలువురు పండితులు భానుడిని ధ్యానిస్తూ జపాలు ఆచరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. తీరంలో లోతైన ప్రాంతాల్లో ప్రజలు ఈతకు దిగకుండా నిరంతరం పహారా కాశారు. బీచ్‌రోడ్డులో వాహనాలను క్రమబద్ధీకరించారు. ఆర్కే బీచ్ వద్ద మహిళలు దుస్తులు మార్చుకోవడానికి జీవీఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

– ఏయూక్యాంపస్




సత్యదేవా.. నమో నమః




ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి ప్రత్యేక పూజలు జరిగాయి. మాఘ పౌర్ణమి కావడంతో భక్తులు వేకువజామున 4 గంటల నుంచే స్వామి దర్శనానికి బారులుదీరారు. పలువురు భక్తులు ముందుగా సముద్ర స్నానమాచరించి సత్యదేవుడి ఆలయానికి చేరుకున్నారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. ఆలయం చుట్టూ గోవింద నామాలు స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. అధిక సంఖ్యలో సామూహిక వ్రతాలు జరిగాయి. అనివెట్టి మండపంలో కూడా ప్రత్యేక వ్రతాలు జరిపారు. ఘాట్‌రోడ్డు అందుబాటులోకి రావడంతో పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు దయారాం స్వీట్ స్టాల్ పక్క నుంచి భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో టి.రాజగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. – డాబాగార్డెన్స్



స్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్త జనం

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా కన్నబాబు



సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా మాజీ మంత్రి కురసాల కన్నబాబు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆయన కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు.

ప్రతి బుధవారం సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్ గ్రీవెన్స్ డే

సాక్షి, విశాఖపట్నం : జీఎస్టీ సమస్యల పరిష్కారం కోసం ప్రతి బుధవారం 'ఓపెన్ డే' పేరుతో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ విశాఖ జోన్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ ఫెసిలిటేషన్ చర్యల్లో భాగంగా వాణిజ్య, పరిశ్రమలకు చెందిన ఎవరైనా బుధవారం సెంట్రల్ జీఎస్టీ, కస్టమ్స్ శాఖలోని ఏ సీనియర్ అధికారినైనా కలిసి తమ ఫిర్యాదును తెలియజేయవచ్చని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే సమగ్ర వివరాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చెయ్యాలని.. దానికి సంబంధించిన ఆధారాల పత్రాలు కూడా జతపరచాలన్నారు. తమ జీఎస్టీ ఫైళ్లు ఎక్కడ నిలిచిపోయాయన్న వివరాలను కూడా వెల్లడిస్తే.. వీలైనంత త్వరగా పరిష్కృతమయ్యేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.33.13 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు బుధవారం చేపట్టారు. గత నెల 4వ తేదీ నుంచి ఈ నెల 12వ తేదీ వరకు రూ.33,13,320 నగదు, 91.100 గ్రాముల బంగారం, 831 గ్రాముల వెండి లభించింది. యూఎస్‌ఏ డాలర్లు 58, సింగపూర్ డాలర్లు 2, కెనడా డాలర్లు 65, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దిర్హామ్ 25, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సెంట్రల్ బ్యాంక్ దిర్హామ్ 5, బ్యాంక్ నగేర మలేషియా ఆర్‌ఎమ్ 2, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ దీనార్ ఒకటి, నేపాల్ రాష్ట్ర బ్యాంక్ రూపీస్ 110 లభించాయి.

వాట్సాప్ ద్వారా అప్పన్న ఆర్జిత సేవ టికెట్లు



సింహాచలం: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం టికెట్లు, ఆర్జిత సేవ టికెట్లు పొందవచ్చని ఈవో వి.త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. వాట్సాప్ నెంబర్ 95523 00009 ద్వారా భక్తులు పై సేవలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వందే భారత్‌ల నిర్వహణ వైజాగ్‌లోనే!



- కొత్త జోన్ ఏర్పాటు నేపథ్యంలో రైల్వే బోర్డు చకచకా అడుగులు
- ఏడాదిన్నర క్రితం మంజూరైన ప్రాజెక్టుకు స్థలం ఎంపిక దాదాపు పూర్తి
- రైల్వే గ్రౌండ్‌లో రూ.500 కోట్లతో మెయింటెనెన్స్ షెడ్ నిర్మాణం
- త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేయనున్న డివిజన్ అధికారులు



వందేభారత్ మెయింటెనెన్స్ డిపో రానుంది ఈ మైదానంలోనే..

సాక్షి, విశాఖపట్నం : భారతీయ రైల్వే వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన వందే భారత్ రైలు.. అన్ని చోట్లా అద్భుతంగా దూసుకుపోతోంది. అన్ని సదుపాయాలతో వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న వందే భారత్ రైళ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. విశాఖ నుంచి ప్రస్తుతం సికింద్రాబాద్, దుర్గ్‌కు సర్వీసులు నడుస్తున్నాయి. త్వరలోనే తిరుపతికి కూడా వందేభారత్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రాబోతున్న నేపథ్యంలో ఇక్కడి నుంచి వందేభారత్ సర్వీసులు మరిన్ని పెరగనున్నాయి. అందుకే విశాఖలో ఈ రైళ్ల నిర్వహణ కోసం మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు భావిస్తోంది. ఏడాదిన్నర క్రితం వందేభారత్ మెయింటెనెన్స్ డిపో వైజాగ్‌లో నిర్మించాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. ఆ తర్వాత అధికారులు దీనిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పుడు జోన్ ప్రక్రియ వేగవంతం కావడంతో మరోసారి ప్రాజెక్టు తెరపైకి వచ్చింది.

రైల్వే పరేడ్ గ్రౌండ్‌లో..

మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు అప్పట్లో స్థల పరిశీలన చేశారు. రైల్ ట్రాక్ కనెక్టివిటీ ఉన్న ఖాళీ స్థలాల్ని అధికారులు పరిశీలించారు. తొలుత వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్ పక్కన నిర్మించాలని భావించారు. అయితే రైలు విశాఖ స్టేషన్ నుంచి అక్కడికి వెళ్లి తిరిగి వచ్చేందుకు చాలా సమయం పడుతుంది. అదే సమయంలో స్టేషన్‌కు రావాలంటే అవుటర్‌లో ఖాళీ లేకపోతే.. గంటల తరబడి వేచి ఉండాలి. దీంతో నిర్దిష్ట సమయానికి కొన్ని సార్లు నడపడం వీలవదు. ఈ సమస్యల్ని దృష్టిలో పెట్టుకొని విశాఖ రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే దీన్ని నిర్మించాలని భావించారు. ఇందుకోసం. రైల్వే పరేడ్ గ్రౌండ్‌ను సూత్రప్రాయంగా ఎంపిక చేశారు. విశాఖ రైల్వే స్టేషన్‌కు అర కిలోమీటర్ దూరంలో ఈ గ్రౌండ్ ఉంది. వాల్తేరు రైల్వే డివిజన్ స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలు, ఇతర క్రీడాపోటీలు, ఎగ్జిబిషన్లకు ఈ గ్రౌండ్‌ను వినియోగిస్తున్నారు. సుమారు 6 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ గ్రౌండ్‌కు వెనుక వైపు పిట్‌లైన్ మాదిరిగా రైల్ ట్రాక్ ఉంది. డిపో నిర్మాణ సమయంలో ఈ పిట్‌లైన్‌కు ట్రాక్‌లను అనుసంధానం చేస్తే పని సులువవుతుంది. అందుకే రైల్వే గ్రౌండ్‌ని మెయింటెనెన్స్ డిపో నిర్మాణ స్థలంగా ఎంపిక చేశారు. ఇప్పటికే రూ.500 కోట్లు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే డీపీఆర్ సిద్ధం చేసి అనుమతుల కోసం రైల్వే బోర్డుకు పంపించనున్నట్లు వాల్తేరు డివిజన్ అధికారులు వెల్లడించారు.

వందే భారత్ నెట్‌వర్క్ బలోపేతమయ్యేలా...

వందేభారత్ రైళ్ల కోసం మెయింటెనెన్స్ డిపోలు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా దక్షిణ కోస్తా జోన్ పరిధిలోని విశాఖ డివిజన్‌లో ఓ డిపో ఏర్పాటు కానుంది. ఈ డిపోలో వందేభారత్ రైళ్లను నిలిపి ఉంచుతారు. ఈ రైళ్లలో ఇన్‌స్పెక్షన్ అండ్ మెయింటెనెన్స్ టేబుల్స్ నిర్వహిస్తారు. ఈ టేబుల్స్‌లో పర్‌ఫార్మెన్స్ టెస్ట్‌లు, ప్రివెంటివ్ మెయింటెనెన్స్ ప్రొసీజర్ల వివరాలు ఉంటాయి. వందేభారత్ రైళ్ల కోసం ట్రాక్షన్, ప్రధాన ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్‌లకు ప్రివెంటివ్, కరెక్టివ్ మెయింటెనెన్స్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇక్కడ రాబోతున్న డిపోలో రన్నింగ్ మెయింటెనెన్స్ బేలో ట్రిప్ షెడ్యూల్‌లు లేదా వీక్లీ షెడ్యూల్‌లు వంటి కార్యాచరణ నిర్వహణ కోసం సౌకర్యాలు కల్పిస్తారు. ఇందులో అండర్ గేర్, ఓవర్ హెడ్ పరికరాలు, ఇంటీరియర్‌లను తనిఖీ చేయడం, వాషింగ్, క్లీనింగ్, బ్రేక్ సిస్టమ్‌లు, డ్రాఫ్ట్ గేర్ (కప్లర్లు), ఎయిర్ కండిషనింగ్, ఇతర ఎలక్ట్రికల్, మెకానికల్ సబ్‌సిస్టమ్‌ల మరమ్మతులు నిర్వహించే అవకాశం ఉంది. ఒకేసారి 5 నుంచి 10 వందేభారత్ రైళ్లను ఇక్కడ మెయింటెనెన్స్ చేసేలా నిర్మాణం ఉండబోతుందని వాల్తేరు వర్గాలు చెబుతున్నాయి.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఏర్పాటు



విశాఖ సిటీ: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలో అన్ని నియోజకవర్గ నేతలకు ఈ కమిటీలో స్థానం కల్పించారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది. విశాఖ జిల్లా ఉపాధ్యక్షులుగా బోని బంగారునాయుడు(భీమిలి నియోజకవర్గం), నడింపల్లి కృష్ణరాజు(తూర్పు), చెన్నా జానకిరామ్(దక్షిణ), బాణాల శ్రీనివాసరావు(ఉత్తర), గల్లా శ్రీనివాస్(పశ్చిమ), రాజన్న వెంకట్రావు(గాజువాక), కోడిగుడ్ల దేవీ సాంబమూర్తి(పెందుర్తి)లను నియమించారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా గంట్రేడి శ్రీనివాస్(భీమిలి), మువ్వల సురేష్(తూర్పు), ద్రోణంరాజు శ్రీవాత్సవ్(దక్షిణ), అల్లు శంకరరావు(ఉత్తర), బాకి శ్యాంకుమార్‌రెడ్డి(పశ్చిమ)లకు అవకాశం కల్పించారు. కోశాధికారిగా కటారి అనిల్‌కుమార్ రాజు(ఉత్తర), సెక్రటరీ ఆర్గనైజేషనల్స్‌గా గుణుపూరు లక్ష్మీ వెంకట నరేష్(పశ్చిమ), కొణతాల ఉమా మహేశ్వరరావు(పశ్చిమ), నక్కా రమణబాబు(గాజువాక), బలిరెడ్డి నాగేశ్వరరావు(గాజువాక), సి.మక్సూద్ అహ్మద్(దక్షిణ), అబ్బిరెడ్డి ఆది విష్ణురెడ్డి(దక్షిణ), కొణతాల రేవతిరావు(ఉత్తర), బుడుమూరు తిరుమలరావు(ఉత్తర), ఎస్.సత్యశ్రీనివాస్ సుబ్రహ్మణ్యం (తూర్పు), ఉమ్మడి దాస్(తూర్పు)లను నియమించారు. సెక్రటరీ యాక్టివిటీగా పద్మనాభం అమ్మాజి(దక్షిణ), గురజాపు రవి(దక్షిణ), చిట్టిరెడ్డి శ్రీనివాసరావు(పశ్చిమ), పల్లా ఎర్నికుమార్(పశ్చిమ), బొడ్డేడ అచ్చంనాయుడు(గాజువాక), పి.పెంటయ్య(గాజువాక), వెంపాడ నూకరాజు(ఉత్తర), కంచుమూర్తి శేఖర్(ఉత్తర), ఇమ్మంది సత్యనారాయణ(తూర్పు), పతివాడ కనకరాజు(తూర్పు)లకు అవకాశం కల్పించారు. అధికార ప్రతినిధులుగా బింగి హరికిరణ్‌రెడ్డి(భీమిలి), పల్లా దుర్గారావు(తూర్పు), దొడ్డి రామనాథ్(దక్షిణ), డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి(ఉత్తర), బి.ఎస్.కృష్ణ(పశ్చిమ), షేక్ మహ్మద్ గౌస్(గాజువాక), మనలత జోబ్దాస్(పెందుర్తి)లను నియమితులయ్యారు.

ఏపీఎంఎస్ఈఎఫ్‌సీ సదస్సు వాయిదా

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, విశాఖపట్నం: ఏపీ స్టేట్ మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ ఫెసిలిటేషన్ కౌన్సిల్ (ఏపీఎంఎస్ఈఎఫ్‌సీ) సదస్సును కలెక్టర్ హరేందిర ప్రసాద్ వాయిదా వేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ.. ఆర్థికపరమైన వ్యవహారాలను చక్కబెట్టేందుకు ఈ నెల 13న కోస్తా రీజియన్ కౌన్సిల్ నిర్వహించేందుకు పరిశ్రమల శాఖ సిద్ధమైంది. దీనిపై ఈ నెల 11న 'సాక్షి'లో 'కోడ్.. డోంట్ కేర్'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు ఉలిక్కిపడ్డారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ స్పందించి, సదస్సును వెంటనే వాయిదా వేయాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సదస్సు వాయిదా వేస్తున్నట్లు పరిశ్రమలకు ఆ శాఖ అధికారులు మెయిల్స్ పంపించారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కౌన్సిల్ ఏర్పాటు చేస్తామని, ఎప్పుడు నిర్వహిస్తామనేది తర్వాత తెలియజేస్తామంటూ ఆయా జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులకు సమాచారం అందించారు.

సీఐఎస్‌ఎఫ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

కంచరపాలెం : సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) కానిస్టేబుల్, డ్రైవర్, డ్రైవర్ కం పంప్ ఆపరేటర్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 21 నుంచి 27 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు https://cisfrectt.cisf.gov.in వెబ్‌సైట్‌లో మార్చి 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థిని కొట్టిన ఘటనపై కలెక్టర్‌కు నివేదిక

డీఈవో ప్రేమ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేట ప్రాథమిక పాఠశాలను బుధవారం డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించారు. 'ఆ..టీచర్‌ను కొనసాగిస్తే పిల్లల్ని బడికి పంపం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయురాలు సన్యాసమ్మతో పాటు బాధిత విద్యార్థిని భావన లాస్య, ఆమె తల్లి దేవి మిగిలిన తల్లిదండ్రులను విచారించి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని డీఈవో తెలిపారు. కేజీహెచ్ ద్వారా విద్యార్థినికి అవసరమైన వైద్య సాయం అందిస్తామన్నారు. ఆయన వెంట ఎంఈవోలు శివరాణి, జయప్రద, సీఆర్పీ దయాశ్ పాల్గొన్నారు.

బాలిక తల్లిదండ్రులకు బెదిరింపులు?

చుట్టు పక్కల పాఠశాలలకు చెందిన కొందరు ఉపాధ్యాయులు పని కట్టుకుని విద్యార్థిని లాస్య తల్లిదండ్రులను బెదిరించినట్టు తెలిసింది. ఉపాధ్యాయురాలు తలపై కొట్టడం వల్ల నరాలు చిట్లి మెదడులో గాయాలవుతాయా అంటూ ప్రశ్నించారు. ఎందుకు ఫిర్యాదు చేశారంటూ హెచ్చరించినట్లు తెలిసింది. విద్యార్థులను కొట్టడం తప్పు కాదన్నట్టు ఆ ఉపాధ్యాయుల బెదిరించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఘటనపై వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆరా

సంతపేట ప్రాథమిక పాఠశాల 3వ తరగతి విద్యార్థిని భావన లాస్యను ఉపాధ్యాయురాలు కొట్టిన ఘటనపై వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆరా తీశారు. డీఈవో ప్రేమ్‌కుమార్‌తో మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భావన లాస్యకు అవసరమైన వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు.

ఏయూలో మళ్లీ రోడ్డెక్కిన విద్యార్థులు

- హాస్టళ్లలో సమస్యలపై వరుస ఆందోళనలు
- స్కాలర్‌షిప్ మంజూరు కాక విద్యార్థుల ఇబ్బందులు
- వీసీ భవనం ముందు విద్యార్థుల ధర్నా



విద్యార్థులతో చర్చిస్తున్న వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు బుధవారం రోడ్డెక్కారు. కూటమి ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయకపోవటంతో, వర్సిటీ హాస్టళ్లలో భోజనం పెట్టడం లేదని ఆందోళన బాట పట్టారు. నెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు ఇలా విద్యార్థులు ధర్నాలు చేయటం ఏయూలో దిగజారిన పరిస్థితులకు అద్దం పడుతోంది. వర్సిటీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కాలేజీల హాస్టళ్లకు చెందిన వందలాది మంది విద్యార్థులు బుధవారం వైస్ ఛాన్సలర్(వీసీ) భవనం ముందు ధర్నాకు దిగారు. గతంలో ధర్నా చేసినప్పుడు, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, హాస్టళ్లలో పరిస్థితులు ఏమాత్రం మారలేదంటూ సుమారు మూడు గంటల పాటు వీసీ కార్యాలయం ముందు బైఠాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేదని చెబుతూ వర్సిటీ హాస్టళ్లలో విద్యార్థుల నుంచే భోజనం బిల్లుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు కట్టని వారికి భోజనం పెట్టట్లేదని విద్యార్థులు వీసీ దృష్టికి తీసుకొచ్చారు. వారంలో ఒకరోజు పెట్టాల్సిన చికెన్ కూడా నిలిపివేశారని, హాస్టళ్లలో ఒక్కో రూమ్‌లో ఒక లైట్, ఫ్యాన్‌కు నెలకు రూ.350లు చొప్పున విద్యుత్ చార్జీల భారాన్ని కూడా విద్యార్థులపైనే వేస్తున్నారని వాపోయారు. హాస్టల్ డెవలప్‌మెంట్ పేరుతో విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేశారని, వాటిని విద్యార్థులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. మెస్ ఫీజులు తగ్గించాలని, మౌలిక వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నా విరమించాలని సూచించినా, తమకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని తెగేసి చెప్పారు. దీంతో వీసీ శశిభూషణ్‌రావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు ధర్నా చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని, 8 మంది విద్యార్థులతో కూడిన కమిటీను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ ప్రెసిడెంట్ హర్షిత్, దుర్గాప్రసాద్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌రోడ్డులో కారు బోల్తా

ముగ్గురికి స్వల్ప గాయాలు



రోడ్డు పక్కన బోల్తా పడిన కారు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వేపగుంటకు చెందిన మండల గణేష్ ముంబయిలో ఇండియన్ నేవీలో పని చేస్తున్నాడు. అతనితో పాటు మరో ఇద్దరు యువతులు మంగళవారం అర్ధరాత్రి విశాఖ నుంచి భీమిలికి కారులో వస్తున్నారు. సుమారు రెండు గంటల సమయంలో ఉమర్ అలీషా ఆశ్రమానికి ముందు మలుపు వద్ద అతి వేగంగా వస్తూ అదుపు తప్పారు. ఈ క్రమంలో కారు రోడ్డు పక్కకు బోల్తా పడగా, కారు రెండు చక్రాలు ఊడిపోయాయి. కారు కూడా నుజ్జయింది. కారును గణేష్ డ్రైవ్ చేస్తుండగా, అతనితో పాటు ఇద్దరు యువతులను స్వల్ప గాయాలయ్యాయి. వారిని విశాఖ వైపు వెళుతున్న ఓ వాహనంలో గణేష్ పంపించేశాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

త్వరితగతిన హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ

విశాఖ లీగల్: హిట్ అండ్ రన్‌కు సంబంధించిన నష్ట పరిహార కేసులను సత్వరమే పరిష్కరించి జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్‌కు పంపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం హిట్ అండ్ రన్ నష్ట పరిహార కేసుల సత్వర పరిష్కారంపై సమీక్ష సమావేశం జరిగింది. విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఆర్డీవోలు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు ప్రత్యక్షంగా, అల్లూరి జిల్లాకు చెందిన అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్ట పరిహార క్లెయిమ్ దరఖాస్తులను పరిష్కరించడంలో ఏమైనా లోపాలు, ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు పి.శ్రీలేఖ, కె.సంగీత మాధూర్, ప్రత్యేక ఉప కలెక్టర్ కె.రమామణి, విశాఖ జిల్లా రవాణా ఉప కమిషనర్ సిహెచ్ శ్రీనివాస్, డీఎస్పీ బి.మోహనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పానికి నాలుగేళ్లు



ఉక్కు ఆందోళనలో భాగంగా పైలాన్ వద్ద నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు (ఫైల్)

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమానికి నాలుగేళ్లు పూర్తయ్యాయి. కూర్మన్నపాలెం ముఖ్య కూడలి వద్ద 2021 ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు ఆందోళనకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కర్మాగారంలో ప్రధాన కార్మిక సంఘాలైన ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, వైఎస్సార్‌టీయూసీ తదితర సంఘాల నేతృత్వంలో ప్రారంభమైన దీక్ష శిబిరంలో సంస్థలోని వివిధ విభాగాల ఉద్యోగులు, కార్మికులు కూర్చుంటూ, కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా గళం వినిపిస్తున్నారు. ఈ శిబిరాన్ని కేంద్ర, రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులు సందర్శించి, కేంద్ర ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. నాలుగేళ్లుగా ఇంత జరుగుతున్నా.. స్టీల్‌ప్లాంట్ సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం దక్కలేదు. ఉక్కు దీక్షలు ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఓబీసీ అసోసియేషన్ సభ్యులు బుధవారం శిబిరాన్ని సందర్శించి, తమ మద్దతు తెలిపారు. కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. నికర లాభాలార్జించే ఈ కర్మాగారానికి ఇలాంటి దుస్థితి రావడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి కర్మాగారాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొప్పాల పరంధామయ్య, పోరాట కమిటీ సభ్యులు, కార్మిక సంఘాల నేతలు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు బాధ్యత మీదే.. చంద్రబాబు..

- మార్చి 19న జీవీఎంసీ వద్ద వార్వా, నివాస్ ధర్నా

డాబాగార్డెన్స్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయాలని విశాఖపట్నం అపార్టుమెంట్స్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్(వార్వా, నివాస్) డిమాండ్ చేసింది. ఈ అసోసియేషన్ కార్య నిర్వాహక కమిటీ సమావేశం బుధవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా వార్వా అధ్యక్షుడు ఎస్.ప్రకాశరావు అధ్యక్షతన నగరంలోని అపార్టుమెంట్లు, కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, మురుగు నీటి సమస్య, స్వైర విహారం చేస్తున్న పందులు, కుక్కలు, గుంతలు పడిన రోడ్లు, ఫ్లైఓవర్‌లు, అండర్‌పాస్‌లు లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు, వీధిలైట్లు, సిటీ బస్సుల కొరత తదితర అంశాలపై చర్చించారు. నగర పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేసి ఇళ్లకు అనుసంధానం చేయకపోవడం, రైతు బజార్లు నిర్మించి వాటిని ప్రారంభించకపోవడంపై మండిపడ్డారు. ఆస్తి పన్ను సమీక్షిస్తానని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, డిస్కంలను ప్రైవేటీకరించొద్దని, విద్యుత్ ప్రీపెయిడ్ రీచార్జ్ విధానం అమలు చేయవద్దని, స్మార్ట్ మీటర్లను పెట్టొద్దని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి అన్ని జోన్ల పరిధిలో నిరసన ప్రదర్శనలు జరపాలని, మార్చి 19న జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ మేరకు పోస్టర్ విడుదల చేశారు. వార్వా ప్రధాన కార్యదర్శి బీబీ గణేష్, జీవీ రమణ, ఖాన్, బీఏ త్రినాథస్వామి, జి రఘురామ్, గోవిందరావు, జి.నాయుడుబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



తోగులురెడ్డి(ఫైల్)

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో సీలింగ్ పనులు చేస్తూ ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. భోగాపురం మండలం కొత్త చెరకుపల్లికి చెందిన రిక్క తోగులురెడ్డి(26) బుధవారం సీలింగ్ పనులకు వినియోగించే అల్యూమినియం చానల్స్ ఉపయోగిస్తున్నాడు. ఇంటి బయట విద్యుత్ స్తంభం వైర్లకు అవి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి తల్లిదండ్రులు నరసింహులు, నరసయ్యమ్మ, పెళ్లయిన అన్నయ్య చిట్టిబాబు, చెల్లెలు రాజు ఉన్నారు. ఇంకా వివాహం కాలేదు. మృతుడి బంధువులతో భవన నిర్మాణ కాంట్రాక్టర్ చర్చలు జరుపుతున్నారు. మృతదేహాన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

నాగేంద్రహారాయ త్రిలోచనాయ.!

- శివలింగాన్ని చుట్టిన నాగుపాము



శివలింగాన్ని చుట్టిన నాగుపాము

డాబాగార్డెన్స్: నగరంలోని ఎగువ రెల్లివీధిలో వెలసిన శివాలయంలో అద్భుతం ఆవిష్కృతమైంది. మాఘ పౌర్ణమి పుణ్యదినాన నాగసర్పం ఒకటి శివలింగాన్ని చుట్టుకుని దర్శనమిచ్చింది. సుమారు 20 నిమిషాల పాటు ఆలయంలో సంచరించిన నాగేంద్రుడు చేసిన విన్యాసాలు భక్తులను పరవశింపజేశాయి. మాఘ పౌర్ణమి రోజున మహాశివుని దర్శనంతో పాటు నాగేంద్రుడు స్వయంగా స్వామి భక్తిని ప్రదర్శించడం కనులారా చూశామని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

మూడేళ్ల కిందట వెలుగులోకి..

సుమారు మూడేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన సమయంలో ఈ శివలింగం వెలుగులోకి వచ్చింది. దళమంతుల మాణిక్యాలరావు(వైఎస్సార్‌సీపీ నాయకుడు) ఇంటి సమీపంలో కొండచరియలు విరిగిపడగా, శివలింగాన్ని ఆయనే గుర్తించారు. అప్పట్లో ఆ శివలింగం చుట్టూ మూడు, నాలుగు పాములు సంచరించేవి అని, కొంత సమయం తర్వాత వాటంతట అవే వెళ్లిపోయేవని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని పూజారి దృష్టికి తీసుకువెళ్లగా, శివలింగం ఎక్కడ లభించిందో అక్కడే ప్రతిష్ఠించాలని సూచించారు. దీంతో మాణిక్యాలరావు ఆ ప్రదేశంలోనే శివాలయాన్ని నిర్మించారు. శివలింగంతో పాటు పార్వతీ సమేత గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. రాత్రి వేళల్లో తరచూ పాములు ఆలయంలోకి వస్తుంటాయని, అయితే అవి ఎవరికీ ఎలాంటి హాని కలిగించలేదని మాణిక్యాలరావు తెలిపారు. మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతుండగా, మధ్యాహ్నం 12 గంటల సమయంలో నాగుపాము ఆలయంలోకి ప్రవేశించడాన్ని మాణిక్యాలరావు స్వయంగా చూసి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. ఆ పాము శివాలయం ప్రాంగణమంతా కలియతిరుగుతూ, పార్వతీ సమేత గణనాథుడి విగ్రహం వద్ద, శివుని చిత్రపటం వద్ద పడగ విప్పి కొంతసేపు నిలబడిందన్నారు. సుమారు 10 నిమిషాల పాటు శివలింగానికి చుట్టుకుని కనిపించిందని ఆయన వివరించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

మద్యం మత్తులో కారు డ్రైవర్ వీరంగం

శివాజీపాలెంలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న కారు

మద్దిలపాలెం: పూటుగా మద్యం సేవించిన ఓ వ్యక్తి కారు నడుపుతూ బుధవారం శివాజీపాలెంలో బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివీ.. రాత్రి 9.30 గంటల సమయంలో రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు.. శివాజీపాలెంలో ముందుగా ఒక ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకున్నాయి. అయినా డ్రైవర్ కారును ఆపకుండా అదే వేగంతో ఇసుకతోట జాతీయ రహదారిపై వెళ్తూ మార్గంమధ్యలో ఆగి ఉన్న బస్సును ఢీకొట్టాడు. తర్వాత ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాలను ఢీకొట్టుకుంటూ వెళ్లడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఆ కారును ఆపేందుకు స్థానికులు దాని వెంట పరుగులు పెట్టారు. శివాజీపాలెం శ్మశానం సమీపంలో రోడ్డు పక్కగా నిలిపి ఉంచిన మరో కారును ఢీకొట్టడంతో అక్కడ ఆగింది. వెంటనే కారులో ఉన్న డ్రైవర్‌ను స్థానికులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

యాక్షన్ థ్రిల్లర్ 'మిషన్ 007'



సినిమా ట్రైలర్, ఆడియో లాంచ్ చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

సీతంపేట: మహంకాళి పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన 'మిషన్ 007'చిత్రం ట్రైలర్, ఆడియో లాంచ్ బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చిత్ర యూనిట్‌తో కలిసి ట్రైలర్, ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన నటీనటులతో నిర్మించిన 'మిషన్ 007' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి సూపర్‌హిట్ చేయాలని పిలుపునిచ్చారు. చిత్ర రైటర్, దర్శకుడు జె.మోహన్‌కాంత్, నిర్మాత మహంకాళి నాగ మహేష్ మాట్లాడుతూ 'మిషన్ 007' సినిమా లవ్, యాక్షన్‌తో యూత్‌ను బాగా ఎంటర్‌టైన్ చేస్తుందన్నారు. ఆంధ్ర, తెలంగాణ, భోపాల్ ప్రాంతాలలో సినిమా షూటింగ్ జరిగిందని, అక్కడి స్థానిక కళాకారులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. హీరో భరత్ చౌదరి, హీరోయిన్ ప్రియాంక నంది మాట్లాడుతూ సినిమా అద్భుతంగా ఉంటుందని, ఇండియన్ ఆర్మీ, పాకిస్థాన్ టెర్రరిస్టుల మధ్య జరిగే యాక్షన్ థ్రిల్లర్ అని చెప్పారు. మార్చిలో ఈ సినిమా విడుదలవుతుందన్నారు. విశ్రాంత లెఫ్టినెంట్ కె.లోకేశ్వరరావు, కళా సంస్థల ప్రతినిధులు భయ్యా శ్రీనివాస్, సన్‌మూర్తి, కొణతాల రాజు, ఆర్‌వీవీ సత్యనారాయణ, మహమ్మద్ ఖాన్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

సర్వే నివేదికపై అనుమానాలుంటే మరో సర్వే చేయిస్తాం

- సరైన నివేదిక ఇవ్వలేదని భావిస్తే అధికారులను బాధ్యులను చేస్తాం
- తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం
- విచారణ వచ్చే వారానికి వాయిదా

సాక్షి, అమరావతి: భీమిలి బీచ్ సమీపంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన నిర్మాణాల విషయంలో అధికారుల కమిటీ తయారు చేసిన సర్వే నివేదికపై అనుమానాలుంటే వేరే అధికారుల చేత తిరిగి సర్వే చేయిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. సరైన నివేదిక ఇవ్వలేదన్న నిర్ణయానికి తాము వస్తే, అందుకు సర్వే చేసిన అధికారులను బాధ్యులుగా చేస్తామంది. తమ ఆదేశాల మేరకు ఏర్పాటయిన కమిటీ సమర్పించిన సర్వే నివేదికను తమ ముందుంచాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతిని హైకోర్టు ఆదేశించింది. ఈ సర్వే నివేదికను పరిశీలించి తదుపరి విచారణలో వాదనలు వినిపించాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భీమిలి బీచ్ సమీపంలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు వెలిశాయంటూ, వీటిపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అలాగే ఇదే అంశంపై గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు కూడా పిల్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన సీజే ధర్మాసనం, భీమిలి బీచ్ వద్ద ఉన్న అక్రమ నిర్మాణాల విషయంలో వారంలోపు సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఇందుకోసం ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ సభ్య కార్యదర్శి, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌లతో ఓ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి స్పందిస్తూ, అక్రమ నిర్మాణాలపై అధికారులు సర్వే చేసి నివేదిక ఇచ్చారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చేశామన్నారు. నూకరాజు తరఫు న్యాయవాది ఎన్.జాయ్ స్పందిస్తూ, బీచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా రెస్టోబార్లు నిర్వహిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముందు అధికారుల సమర్పించిన సర్వే నివేదికను పరిశీలించి, అందుకు అనుగుణంగా వాదనలు వినిపించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

విశాఖలో నిస్సాన్ షోరూమ్, వర్క్‌షాప్

విశాఖ సిటీ : నిస్సాన్ మోటార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లో తన నెట్‌వర్క్ విస్తరించుకోవడంలో భాగంగా విశాఖలో నూతన షోరూమ్, వర్క్‌షాప్ ప్రారంభమైంది. నర్సింహనగర్ హైవేపై కొత్త ఆరెంజ్ నిస్సాన్-వైజాగ్ షోరూమ్, బిర్లా జంక్షన్ వద్ద ఆరెంజ్ నిస్సాన్- వైజాగ్ సర్వీస్ వర్క్‌షాప్‌లను విశాఖ తూర్పు నేవల్ కమాండ్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రియర్ అడ్మిరల్ ఎం.మురళీ మోహన్ రాజు, కమడోర్ అమర్‌జీత్ సలుజా, కెప్టెన్ ఎస్.ఆర్.చక్రవర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిస్సాన్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వత్స మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిస్సాన్ ఇటీవల 'బోల్డ్ ఫర్ ది బ్రేవ్'ను ప్రవేశపెట్టిందని, దీని ద్వారా దేశంలోని రక్షణ సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర పోలీసు విభాగాలు, పారామిలిటరీ దళాలకు అత్యధికంగా విక్రయించబడుతున్న న్యూ నిస్సాన్ మాగ్నైట్‌పై ప్రత్యేక బొనాంజాను అందిస్తోందని వెల్లడించారు. ఈ కార్ ధర రూ.5.99 లక్షల నుంచి రూ.11.50 లక్షల మధ్య ఉంటుందన్నారు. ఇది 20కి పైగా ఫస్ట్-బెస్ట్-ఇన్-సెగ్మెంట్ ఫీచర్లు, 55కి పైగా భద్రతా లక్షణాలతో వస్తోందన్నారు. మేక్-ఇన్-ఇండియా, మేక్-ఫర్-ది వరల్డ్' దార్శనికతకు ఈ కార్ నిదర్శనమన్నారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సు పయనం

డాబాగార్డెన్స్: ద్వారకా బస్ స్టేషన్ నుంచి కుంభమేళా(ప్రయోగరాజ్)కు ఏపీఎస్‌ఆర్టీసీ సర్వీస్ బుధవారం బయలుదేరి వెళ్లింది. జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు యాత్ర బస్సును ప్రారంభించారు. ఈ యాత్ర ఏడు రోజుల పాటు వివిధ పుణ్యక్షేత్రాల మీదుగా సాగనుందని తెలిపారు. కుంభామేళాకు ఈ నెల 16న మరో ట్రిప్ నడపనున్నట్టు పేర్కొన్నారు. టికెట్ ధర రూ.8 వేలుగా నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ లేదా సమీప బస్‌స్టేషన్‌లో టికెట్స్ పొందవచ్చని, మరిన్ని వివరాలకు 9052227083, 9959225602, 9959225594, 9100109731లో సంప్రదించవచ్చన్నారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టొద్దు

పూర్ణామార్కెట్ వద్ద ఆందోళన



ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు, సిటు నాయకులు

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద గల చిరు వ్యాపారుల పొట్ట కొట్టవద్దని కోరుతూ సీఐటీయూ కార్యదర్శి సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా ఆక్రమణల పేరుతో చిరు వ్యాపారులను జీవీఎంసీ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. వాస్తవానికి చిరు వ్యాపారులకు వెండర్ కమిటీ ఉందన్నారు. ఆక్రమణలు తొలగించాలంటే అధికారులు 90 రోజులు ముందుగా నోటీసులిచ్చి, ఆ తర్వాత దుకాణాలు తొలగించాలనే నిబంధన ఉందని గుర్తు చేశారు. అయితే అటువంటి నిబంధనలు పాటించకుండా దుకాణాలు తొలగించడం అన్యాయమన్నారు. కనీసం పేదల దుకాణాలు తొలగించే ముందు, వారికి మరో చోట స్థలం చూపించాలని కోరారు. ఎటువంటి సమాచారం లేకుండా చిరు వ్యాపారులను రోడ్డున పడేసి వారి పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వ్యాపారులందరూ ర్యాలీగా సీపీ, కలెక్టర్, జీవీఎంసీ కార్యాలయాల వరకు వెళ్లి అక్కడ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వ్యాపారులు శ్రీను, అప్పారావు, ఆశీ, జి.శ్రీను, వెంకటరావు, బాలరాజు, ఈశ్వరరావు, కొబ్బరికాయల రాము, లక్ష్మమ్మ, పైడితల్లమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రమణయ్య భార్యకు ఉద్యోగంపై హర్షం

రెవెన్యూ అసోసియేషన్ పెద్దలకు కృతజ్ఞతలు

మహారాణిపేట: తహసీల్దార్ ఎస్.రమణయ్య హత్యోదంతం విషాదకరమని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ చేసిన కృషి ఎనలేనిదని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ.త్రినాథ్, కార్యదర్శి సిహెచ్.వి.రమేష్ అన్నారు. జిల్లాలో దారుణ హత్యకు గురైన తహసీల్దార్ ఎస్.రమణయ్య భార్య పోలాకి అనూషకు కారుణ్య నియామకం ద్వారా ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగం లభించింది. ఈ మేరకు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ జనరల్ రామిశెట్టి వెంకట రాజేష్‌కు వీరు కృతజ్ఞతలు తెలిపారు. జీవనాధారం కోల్పోయిన వృద్ధులైన తల్లిదండ్రులు, ముక్కుపచ్చలారని ఐదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు, భార్య ఆక్రందన ఉద్యోగుల హృదయాలను కలచివేసిందన్నారు. రమణయ్య కుటుంబాన్ని ఆదుకోవడానికి శక్తివంచన లేకుండా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ కృషి చేశారని, ఈ నియామకం ద్వారా ప్రతి రెవెన్యూ ఉద్యోగిలో ధైర్యాన్ని నింపారన్నారు. ఈ సహాయాన్ని ఎప్పటికీ మరువలేమని త్రినాథ్, రమేష్ అన్నారు.

ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించవద్దు

పశ్చిమ ఏసీపీ పృథ్వీతేజ



ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ

గోపాలపట్నం: విశాఖకు వచ్చే అతిథులకు తొలి పరిచయస్తులు మీరేనని ప్రీపెయిడ్ ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులను ఉద్దేశించి పశ్చిమ ఏసీపీ ఏబీ పృథ్వీతేజ అన్నారు. ప్రయాణికులతో ఎలా మెలగాలి అనే అంశంపై బుధవారం విశాఖ విమానాశ్రయంలో వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయం ఎంతో అభివృద్ధి చెందిందని, జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులు వస్తున్నారన్నారు. వారికి మన విశాఖ గొప్పదనాన్ని, గౌరవ మర్యాదలను తెలియజేసే విధంగా ప్రవర్తించాలన్నారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించవద్దని సూచించారు. అధిక ధరలు డిమాండ్ చేయడం, బలవంతంగా వసూలు చేయడం వంటివి చేయరాదన్నారు. మంచి సత్ప్రవర్తనతో మెలగాలని, మళ్లీ వారు వచ్చినప్పుడు మీ గురించే ఇక్కడ వాకబు చేసే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ సీఐ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

రేపు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల రాక

మహారాణిపేట: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి, గొండు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణ, జె.రాజేంద్రప్రసాద్ ఈ నెల 14న విశాఖ వస్తున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు కేజీహెచ్‌లో వైద్యులు, వైద్యాధికారులతో భేటీ అవుతారు. ఇదే కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు, స్త్రీ‌శిశు సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం, కార్మిక శాఖాధికారులు పాల్గొంటారు. జనన, మరణాల నమోదు ధ్రువీకరణ పత్రాల్లో తప్పొప్పుల సవరణతో పాటు పలు అంశాలపై చర్చించనున్నారు. సాయంత్రం నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలను తనిఖీ చేస్తారు.